ప్రజాశక్తి-ఉయ్యూరు : స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం ద్వారా పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ అన్నారు. శనివారం ఆయన ఉయ్యూరు మండలం కాటూరు గ్రామంలో స్థానిక శాసనసభ్యులు బోడె ప్రసాద్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బాగంగా గ్రామంలో రహదారులను, డ్రైనేజ్, పరిసరాలను పరిశుభ్రం చేసి గ్రామస్తులకు స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమ ప్రాముఖ్యతను, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామ సచివాలయం వద్ద మొక్కలు నాటారు. తడి పొడి చెత్తను వేరు చేసే డస్ట్ బిన్ లను గ్రామస్తులకు పంపిణీ చేశారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌పై అధికారులు, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిపిఓ జె అరుణ, డ్వామా పీడీ కేవీ శివప్రసాద్, ఎంపీడీవో శేషగిరిరావు, తహసిల్దార్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి : డిఆర్ఓ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్ర శేఖర రావు అన్నారు.స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బాగంగా శనివారం స్వచ్ఛ కలక్టరేట్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలక్టరేట్ ఆవరణను శుభ్రం చేశారు.అనంతరం డిఆర్ఓ మాట్లాడుతూ ప్రతి నెలలో మూడో శనివారం నాడు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలందరూ భాగస్వామ్యం అయ్యి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కషి చేయాలన్నారు.ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు, సిబ్బంది పరిసరాలను శుభ్రం చేసుకుని ఆదర్శంగా ఉంటూ ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలక్టరేట్ ఏ ఓ,వీరాంజనేయ ప్రసాద్, వివిధ సేక్షన్ ల సుపర్ డెంట్ లు ,కలక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ :** కృష్ణా విశ్వవిద్యాలయంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమంలో భాగంగా శనివారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో చెత్తను తొలగించారు. రిజిస్ట్రార్ ఆచార్య కె శోభన్ బాబు పర్యవేక్షణలో బోధనేతర సిబ్బంది మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్లాస్టిక్ వ్యర్థాలను, విరిగిపోయిన చెట్లను తొలగించారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** ప్రతిఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చోరగుడి గ్రామ సర్పంచ్ కందిమల్ల పూర్ణ కుకుమారి అన్నారు. శనివారం చోరగుడి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించి మాట్లాడుతూ చోరగుడి గ్రామ అభివద్ధికి కట్టుబడి ఉన్నామని అన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అలాగే మండలంలోని లంకపల్లి, తాడంకి, మంటాడ గ్రామాల్లో కూడా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు జరిగాయి. **ప్రజాశక్తి. చల్లపల్లి :** ప్రజలు సహకరిస్తేనే స్వచ్ఛత సాధ్యమని ఎంపీపీ కోట విజయ రాధిక అన్నారు. శనివారం చల్లపల్లిలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో శ్రమదానం, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ అనగాని వెంకటరమణ, ఈఓఆర్డీ వీ.రవిశంకర్, సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, ఈఓ పీవీ మాధవేంద్రరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** రాష్ట్ర ప్రభుత్వ, ఎక్సైజ్ శాఖ అదేశాల మేరకు నెలలో 3వ శనివారం స్వంచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఎక్సైజ్ సిఐ వెంకటరమణ నిర్వహించినట్లు తెలిపారు. శనివారం స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సిబ్బందితో కలసి సిఐ కార్యాలయం, సమీపంలోని చెత్తను తొలగించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండల కేంద్రమైన గుడ్లవలేరు గ్రామ పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామం లో ఉన్న వివిధ ప్రదేశాలలో పరిశుభ్రత చెయ్యడంతో పాటు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి టి విజయ సారధి, పంచాయతీ కార్యదర్శి ఏ జేఎల్ నరసింహారావు ,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** ప్రతి ఒక్కరూ పరిశుభ్రత కోసం కొంత సమయాన్ని కేటాయించాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. శనివారం మండలంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ " కార్యక్రమంలో భాగంగా జంగల్ క్లియరెన్స్ , మొక్కలు నాటడం, మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీవో ఇ సత్య కుమార్, తాసిల్దార్ విమలా కుమారి, ఇఓపిఆర్‌డి వి దిలీప్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి మోపిదేవి :** గ్రామపంచాయతీ పాలకవర్గాలు ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ చేపట్టాలని మోపిదేవి ఎండిఓ జంగం స్వర్ణ భారతి పిలుపునిచ్చారు. మోపిదేవి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది ఎండిఓ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈవోపీఆర్డి కమ్మిలి త్రిపుర సుందరి ప్రతిజ్ఞ చేయగా ఎంపీపీ రావి దుర్గవాణి, మాజీ సర్పంచి రావినాగేశ్వరరావు, జడ్పిటిసి మెడబలిమీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** తాడిగడప పురపాలక సంఘ పరిధిలోని కానూరు సర్కిల్లోని పెనమలూరు పోలీస్ స్టేషన్ వద్ద నుండి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ ప్రతిజ్ఞ నిర్వహించారు.మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, పారిశుధ్య సిబ్బంది, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డలో మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని గుర్రపు చెరువు చుట్టూ ఉన్న ప్రదేశాన్ని పరిశుభ్రం చేసి పంచాయతీ వారి ఆధ్వర్యంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంపీడీవో ఎం మరియాదేవి, సర్పంచ్ గో రుముచ్చు ఉమా లు మొక్కలు నాటారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద నుండి రాజీవ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.



పేదలకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి : నిరుపేద కుటుంబాలు విద్యతో పురోగతి పొందాలని ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ సూచించారు. శనివారం చల్లపల్లిలోని రెండు ఎస్టీ కాలనీల్లో గుడారాల్లో జీవిస్తున్న అరవై కుటుంబాలకు ఐవీఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష వ్యయంతో నిత్యావసర సరుకులు, నూతన దుప్పట్లను సురేష్ - రోజా దంపతులు అందచేశారు. ఈ సంద`ర్భంగా సురేష్ మాట్లాడుతూ విద్యతోనే సామాజిక, ఆర్థిక పురోగతి సాధ్యం అన్నారు. నిరుపేద ఎస్టీ కుటుంబాల వారు తమ పిల్లలను విద్యావంతులను చేయాలని సూచించారు. సంస్థ ప్రతినిధి వేములపల్లి రోజా, విదేశీ అతిధులు హిల్లరి, కారెన్ పాల్గొన్నారు.



ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు, నాయకులు

ఎంఎల్‌ఎకు చెత్త వ్యాన్ డ్రైవర్ల వినతి

పెనమలూరు : తాడిగడప మున్సిపాలిటీలో తడి పొడి చెత్త సేకరించే వ్యాన్ డ్రైవర్లకు జీతాలు చెల్లించాలని కోరుతూ చేస్తున్న సమ్మె 9వ రోజుకు చేరింది. శనివారం పోరంకి సెంటర్లో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ జీతాలు రాకపోవడంతో మూడు నెలల నుంచి ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను అధికారులు అర్థం చేసుకొని జీతాలు ఇచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు పెనమలూరు ఎంఎల్‌ఎ బోడే ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో పెనమలూరు మండలం సిఐటియు కార్యదర్శి యు త్రిమూర్తులు, పెనమలూరు మండలం సిఐటియు నాయకులు మస్తాన్ వలి, తడి పొడి చెత్త వ్యాన్ డ్రైవర్ల సిఐటియు నాయకులు నరసింహారావు, సూర్యనారాయణ, మస్తాన్వలి, రాజు, కే రాంబాబు, దినేష్, బూసి బాబు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి-నాగాయలంక : మండలంలోని వద్ధాశ్రమంలో టీడీపీ నేత, ప్రముఖ వ్యాపారవేత్త బొబ్బా గోవర్ధన్ సమకూర్చిన నిత్యావసరాలను ఆ పార్టీ రాష్ట్ర నేత కనపర్తి శ్రీనివాస్ చేతుల మీదుగా తెలుగుదేశం నేతలు పంపిణీ చేశారు.. ఆశ్రమంలో వసతి పొందుతున్న 20 మంది వద్ధులకు నెల రోజులకు సరిపడా బియ్యం, ఇంతర నిత్యావసరాలను బొబ్బా గోవర్ధన్ సమకూర్చారు. ఈ పంపిణీ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, తెలుగుదేశం నేతలు మెండు లక్ష్మణ రావు, కైతేపల్లి అంకాలు, కొల్లూరి వెంకటేశ్వరరావు, విజయ్ పాల్గొన్నారు.



పలుచోట్ల ఉచిత కంటి వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నంలోని స్తానిక రాజుపేట ముస్లిం షాదీ ఖానాలో ప్రముఖ ప్రభుత్వ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ జి భానుమూర్తిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా రాజుపేట పరిసర ప్రాంతాలు ఉన్న పేద ప్రజలు దాదాపు 100 మంది పైగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఉపయోగించుకున్నారు. ఈ శిబిరంలో 23 మందికి ఆపరేషన్ అవసరమని నిర్ధారించి ప్రభుత్వ ఆసుపత్రికి ప్రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో మోడ్రన్ ఐ ట్రస్ట్ చైర్మన్ నియాజ్ మరియు ఆసుపత్రి సిబ్బంది, షాదీ ఖానా మేనేజ్మెంట్ సభ్యులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** స్థానిక లయన్స్ సేవ భవనంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లైన్ కొల్లి రాజేష్ ఆర్థిక వితరణతో కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పేదలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోళ్ళు అందజేయనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. గుడివాడ లయన్స్ కంటి వైద్యులతో పాటు లయన్స్ క్లబ్ పెరుమల్లు, నవాబు, సుబ్బారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-కంకిపాడు :** నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా కంకిపాడులో మెడికల్ క్యాంపు, అన్నదానం శనివారం నిర్వహించారు. కంకిపాడు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శంకర నేత్ర చికిత్సలయం విజయవాడ వారి ఆధ్వర్యంలో సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన కళ్ళజోళ్లను మందులను అందించారు. అనంతరం సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికష్ణ, కంకిపాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చలవది రాజా గురవయ్య, ప్రధాన కార్యదర్శి వణుకూరు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి చల్లపల్లి : మచిలీపట్నంకు చెందిన మహమ్మద్ కైరా పుట్టినరోజు సందర్భంగా తండ్రి మహమ్మద్ రియాజ్, తాత, డాక్యుమెంటరీ రైటర్ మహమ్మద్ సర్దార్ రహీం సౌజన్యంతో స్థానిక లయన్స్ భవనంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో నేత్ర వైద్య నిపుణులు వెంకట్రావు 29 మందికి నేత్ర పరీక్షలు చేసి ఆపరేషన్ కొరకు 12 మందిని గుర్తించి గూడూరులోని నేత్రాలయానికి పంపించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి రాధాకష్ణ, కస్తూరి వెంకట వర ప్రసాద్, నర్రా సాయి బాబు తదితరులు పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : ఆటోనగర్‌లో పెయింటర్‌గా పనిచేస్తూ మృతి చెందిన ఎండి మౌలాలి కుటుంబానికి కృష్ణాజిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ గుడివాడ ఆటోనగర్ కమిటీ శనివారం రూ.10వేలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ హమీద్ అలియాస్ అమీర్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దూస్, సిఐటియు పట్టణ కార్యదర్శి టి. లక్ష్మణరావు, నాయకులు బొబ్బర పల్లి ఆంజనేయులు, షేక్ రహ్మాన్, ఎస్ఎమ్ మొహిద్దీన్ భాష, కల్వకుంట నాగరాజు, రెడ్డి నాగరాజు, అన్నమనేడి వెంకటరమణలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై మహిళల ధర్నా

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని సీలింపేట విలియంపేటలో గత కొన్ని రోజులు మంచినీళ్ల రావట్లదని అధికారులు నాయకులు తమ పట్ల వివక్షత ధోరణిలో ఉన్నారని శనివారం మహిళలు ముత్యాల వెళ్లే రోడ్డుపై ఖాళీ బిందెలతో మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇరువైపుల ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు సంఘటన స్థల వద్దకు వచ్చి మహిళలతో సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ మహిళలు వినకపోవడంతో విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సంఘటన స్థానం వద్దకు వచ్చి మంచినీళ్ల వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మహిళలు నిరసన కార్యక్రమం విరమించారు. విషయాన్ని తెలుసుకొని నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆ ప్రాంతానికి వెళ్లి ప్రజలని సమస్యల్ని అడిగి తెలుసుకొని అధికారులకు తెలియజేశారు. ఈ ప్రాంతంలో సుమారుగా 200 ఇళ్లకు తాగునీరు అందట్లేదదని అన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పఠాన్ ఫిరోజ్ ఖాన్ జగ్గయ్యపేట మండలం పార్టీ అధ్యక్షులు బూడిద నరసింహారావు, నాయకులు పాల్గొన్నారు.



ఇపిఎఫ్ చెల్లింపుల్లో అవకతవకలపై విచారించాలి : సత్యబాబు

ప్రజాశక్తి-విజయవాడ : ఇపిఎఫ్ చెల్లింపులలో జరిగిన అవకతవకలను పరిశీలించి శానిటేషన్ కార్మికులకు తగిన న్యాయం చేయాలని సిపిఎంఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కోరారు. ఈ మేరకు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్‌కు మున్సిపల్ వర్కర్స్ అండ్‌ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు)నాయకులతో కలిసి బోయి సత్యబాబు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శానిటేషన్ వర్క్ చేస్తున్న కార్మికులకు గత ఆరు నెలల నుండి ప్రైవేట్ కాంట్రాక్ట్ సంస్థ వారు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) 12 శాతం చెల్లించకుండా ఇపిఎఫ్ చెల్లింపుల్లో సదరు కాంట్రాక్టర్ పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తగిన న్యాయం చేయాలని కోరారు. వేతనాలు సరిగా ఇవ్వక, ఇపిఎఫ్ డబ్బులు కూడా కాజేస్తూ సదరు కాంట్రాక్టర్లు జేబులు నింపుకుంటున్నారని అన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ ఇపిఎఫ్ చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి కార్మికులకు తగిన న్యాయం చేస్తానని హామీనిచ్చారు. డిసెంబర్ నెల వేతనం వెంటనే చెల్లించే విధంగా తగు చర్యలు చేపడతానని ఇన్‌చార్జి కమిషనర్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులతో పాటు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నేత వేమా జన్మదిన వేడుకలు



సురేష్‌బాబుకు కేక్ తినిపిస్తున్న జగన్మోహన్‌రావు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల ఉప సర్పంచ్, పట్టణ వైసిపి అధ్యక్షుడు వేమా సురేష్ బాబు జన్మదిన వేడుకలు వివిఎస్‌బి యూత్ ఆధ్వర్యంలో శనివారం కంచికచర్లలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వేమా సురేష్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు సమక్షంలో వేమా సురేష్ జన్మదిన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వేమా సురేష్‌ను శాలువాతో సత్కరించారు. కంచికచర్ల మండల వైసిపి కన్వీనర్ బండి మల్లికార్జునరావు పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వివిఎస్‌బి యూత్ సభ్యులు సురేష్‌ను గజమాలతో సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చింతా రవి, నంబూరు పెదబాబు, మార్త శ్రీను, బుడ్డి సత్యం, వివిఎస్‌బి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ



ప్రజాశక్తి - విజయవాడ : టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్‌టిఆర్) 29వ వర్ధంతి వేడుకలు విజయవాడ నగరంలో శనివారం జరిగాయి. తూర్పు నియోజక వర్గంలోని నాలుగవ డివిజన్‌లో టిడిపి సీనియర్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు నేతృత్వంలో వారి కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు చేతుల మీదుగా 200 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 4వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో టిడిపి రాష్ట్రనాయకులు గన్నె వెంకటనారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు, ఆపార్టీ కార్పొరేటర్లు, నాయకులు సెంట్రల్ నియోజకవర్గంలోని టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - నందిగామ : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం, నందిగామలో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్, స్వర, కె.యం.ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, కంటి శిబిరం నిర్వహించారు. నందిగామ ఆర్టీవో ఎం.పద్మావతి మాట్లాడుతూ డ్రైవర్లు ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి చూపు, బిపి, షుగర్ పరీక్షలు చేయించుకొని జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరగవన్నారు. సహాయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కె.జయచంద్ర మాట్లాడుతూ ఓవర్ స్పీడ్‌గా వాహనం నడపకూడదని, డ్రైవర్లు యూనిఫాంలో ఉండాలని తెలిపారు. డాక్టర్ మహేష్ మాట్లాడుతూ రహదారిపై ప్రమాదం జరిగినపుడు, ప్రమాద బాధితులను రక్షించడంలో మొదటి 60 నిమిషాలు ప్రమాద తీవ్రతను తగ్గించడానికి, మరణాలు తగ్గించడానికి చాలా కీలకమైనదని తెలిపారు.

ప్రశాంతంగా నవోదయ ఎంట్రన్స్ పరీక్ష

ప్రజాశక్తి - మైలవరం : నవోదయ ఎంట్రన్స్ పరీక్ష శనివారం మైలవరంలో ప్రశాంతంగా జరిగింది. ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. స్థానిక ఎస్.వి.ఆర్ జిఎన్ఆర్ బాలుర హై స్కూల్లో ఏర్పాటు చేసిన కేంద్రంలో 312 మందికి 124 మంది హాజరై నట్లు పరీక్షా కేంద్రం సూపరిండెంట్ ఆర్‌విఎస్ కృష్ణారావు తెలిపారు.

చెట్లు నరికివేత

ప్రజాశక్తి - జి.కొండూరు : మండలంలోని చెవుటూరు గ్రామంలోని ముచ్చువాని చెరువు సమీపంలో డొంకలో ఉన్న వేపచెట్లను అక్రమార్కులు కొట్టేస్తున్నారు. గతంలోను ఇదే మాదిరిగా వేప చెట్లను టేకు చెట్లను కొట్టి సొమ్ము చేసుకున్నారు.యాళ్ల తరబడి ఉన్న ఇలాంటి చెట్లను కొట్టడం వలన అటుగా పంట పొలాలకు , పశువులను మేపేందుకు వెళుతున్న రైతులు ఇబ్బంది పడుతున్నామని అంటున్నారు. ఎండగా ఉన్న సమయంలో పశువులు ఇక్కడికి వచ్చి సేదా తీరుతాయని ఇలా చెట్లను నరికితే వేసవికాలంలో పశువుల తో పాటు రైతులు కూడా ఇబ్బంది పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గ్రామస్తులు. అధికారులు కలగజేసుకొని అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండలం కేంద్రంలో మన్నెశ్రీ, జయకుమార్, సుకుమార్ జ్ఞాపకార్థం ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో యువకులకు, మహిళలకు రెండు రోజులుగా జరిగిన షటిల్, క్యారమ్స్, టెన్నికాయిట్, కబడ్డీ పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులందజేశారు. ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు చాట్ల విజయకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహిళల కబడ్డీ మొదటి బహుమతి అశ్విని, రత్న టీం, రెండో బహుమతి విజయలక్ష్మి, స్వప్న టీం, టెన్నికాయిట్‌లో మొదటి బహుమతి అశ్విని, నిరీష టీం, రెండో బహుమతి అపర్ణ జ్యోతి టీం, పురుషుల విభాగంలో షటిల్ మొదటి బహుమతి చాట్ల అశోక్, వీరయ్య టీం, రెండో బహుమతి బండపల్లి ప్రేమ్ కుమార్, రాకేష్ టీం క్యారమ్స్‌లో మొదటి బహుమతి చాట్ల సువర్ణరావు, అశోక్ టీం, రెండో బహుమతి మల్లాది శ్రీను, వీరాస్వామి గెలుపొందారు. వారికి శనివారం మన్నె శాంతి కుమార్, చాట్ల ఆదియ్య, మన్నె ఋషిమ్మ చేతుల మీదుగా ప్రైజ్ మనీ అందజేశారు.

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - మైలవరం : నిరుద్యోగ యువతకు పరిశ్రమల్లో శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్ బాబు, డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇళ్ల రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు https:// pminternship. mca.gov.in/login వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి ఈ నెల 21వ తేదీలోగా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రబీ 2024 - 25 సంవత్సరానికి పంటల ఈ రికార్డులను తిరువూరు ఆర్డిఓ మాధురి తనిఖీ చేశారు. మండల పరిధిలోని ముచ్చినపల్లి గ్రామంలో ఈ పంట నమోదు చేసిన రికార్డులను సరిగా ఉన్నాయో లేదో, ఆ పంట, రకం కరెక్ట్‌గా నమోదయిందో లేదో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయాధికారి రెడ్డిగూడెం ఆర్.సురేష్, వ్యవ సాయ విస్తరణ అధికారి ఆరేపల్లి పవన్ కుమార్ ముచ్చినపల్లి గ్రామ రెవెన్యూ అధికారి విజయకుమార్ రైతులు పాల్గొన్నారు.

రీ సర్వే పై గ్రామ సభ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ముచ్చనపల్లి గ్రామంలో రీసర్వేకు సంబంధించి గ్రామసభ సచివాలయం వద్ద శనివారం నిర్వహించారు. తహశీల్దార్ జె.సుశీలదేవి, అధ్యక్షతన జరిగిన సభలో రైతులు రీ సర్వే చేసే సిబ్బందికి రైతులు వారి భూములకు సంబంధించి వారి వారి ధ్రువ పత్రాలు చూపించి సర్వే సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. గ్రామసభలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గంధం పుల్లయ్య, మండల సర్వేయర్ మురళి, వి.ఆర్.ఓ. విజయకుమార్, గ్రామ సర్వేయర్ వేణు, గ్రామ నాయకులు రైతులు పాల్గొన్నారు. ముచ్చనపల్లి గ్రామంలోని రీసర్వేలో భాగంగా వ్యవసాయ భూములు, వ్యాసాయేతర (గ్రామ కంఠం) భూములకు మధ్య వున్న సరిహద్దులను నిర్ణయించు రీ సర్వే పనిని ఆర్‌డిఒ కె.మాధురి పరిశీలించారు.

20 నుంచి ఆరోగ్య శిబిరాలు

ప్రజాశక్తి - గంపలగూడెం : ఈనెల 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశు వైద్యులు డాక్టర్ సాయి కృష్ణ, అభిలాష తెలిపారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ, ఆవులు, గేదెలకు అనారోగ్య సమస్యలు, కోళ్లకు ఉచిత మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని వైద్యులు కోరారు.

పలుచోట్ల ఎన్‌టిఆర్ వర్ధంతి

జిల్లాలో పలుచోట్ల ఎన్‌టిఆర్ 29వ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి నాయకులు కార్పొరేటర్లు పలుచోట్ల ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పలుచోట్ల చీరలు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - వత్సవాయి : లింగాల, మంగొల్లు, భీమవరం, కన్నెవేడు, ఇందుగుపల్లి తదితర గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. **విస్సన్నపేట :** స్థానిక రెడ్డిగూడెం రోడ్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక సభ్యులు నెక్కలపు శ్రీనివాసరావు(డాబా), టౌన్ పార్టీ అధ్యక్షులు మరి పైన వెంకటేశ్వరరావు (చిన్నోడు) పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నంలో నందమూరి తారక రామారావు 29 వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ ఎన్టీఆర్ చేసిన సేవలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఎన్టీఆర్ గారు ఎన్నో సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేశారన్నారు. ముఖ్యంగా పేదల సంక్షేమంతో పాటు ఉమ్మడి ఏపీ సమగ్ర అభివృద్ధికి ఆయన శ్రీకారం చుట్టారన్నారు. తెలుగుదేశం పార్టీ ఏర్పాటుతో తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారన్నారు. కొటికలపూడి గ్రామంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని),ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ రెండు విగ్రహావిష్కరణ కార్యక్రమాల్లో మైలవరం సభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరులో ఫ్యాక్టరీ సెంటర్, పీటీ కొత్తూరు, పాత తిరువూరు, రైతు బజార్, అన్నా క్యాంటీన్ లోని "ఎన్టీఆర్ విగ్రహాలకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. **నందిగామ :** ఎన్టీఆర్ ఆశయ సాధనలో అనుక్షణం పనిచేస్తామని ఏపీ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. నిరుపేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఎంఎల్ఎ కొనియాడారు. నందిగామ రైతుపేట పార్టీ కార్యాలయంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లెజెండ్రీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. **మైలవరం :** రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. దివంగత ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా శనివారం మైలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక నితీష్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్విఎస్ కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లయన్ ఎస్‌విఎస్ నివృత్తరావు పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** పేదల సంక్షేమనికి ఆద్యుడు అన్న ఎన్టీఆర్ అని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. రెడ్డిగూడెంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. తొలుత స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. **కంచికచర్ల :**స్థానిక గ్రామ పంచాయితీ షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా గల ఎన్టీఆర్ విగ్రహానికి కాకతీయ యూత్ ఆధ్వర్యంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబూ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి కార్యకర్తలు రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. అనంతరం కోగంటి బాబూ అన్నదానం ప్రారంభించారు. **జగ్గయ్యపేట:** పట్టణంలో బంగారు కొట్టు సెంటర్ వద్ద నుండి భారీ బైక్ ర్యాలీతో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గల నందమూరి తారకరామారావు విగ్రహానికి టిడిపి నాయకులతో కలిసి శాసనసభ్యులు, ఏపిఐఐసి సభ్యులు, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం సుబ్బారావు, శ్రీరాం చిన్నబాబు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు, పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా కంచికచర్లలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం

ఎంఎల్‌సి లక్ష్మణరావు గెలుపు అందరి బాధ్యత

- ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశంలో వివిధ సంఘాల నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - విజయవాడ : ఉపాధ్యాయులు, ఉద్యోగుల తరపున శాసనమండలిలో గళమెత్తే కె.ఎస్.లక్ష్మణరావును వచ్చే ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిపించాలని వివిధ ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చాయి. ఈ ఏడాది మార్చిలో జరిగే ఎంఎల్‌సి ఎన్నికల్లో కృష్ణా - గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుండి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ప్రజాసంఘాలు బలపరచిన ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థిగా పోటీచేస్తున్న కె.ఎస్.లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశం జరిగింది. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని బాలోత్సవ భవన్లో ఎంఎల్‌సి ఎన్నికల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన జరిగిన ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అందరికీ నిత్యం అందుబాటులో ఉండే ప్రజల మనిషి, నిత్య కృషీవలుడు, మేధావి, విద్యావేత్త అయిన ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావును గెలిపిం చుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యా య, ఉద్యోగ, కార్మిక సంఘాలతోపాటు వివిధ ప్రజా సంఘాలపై ప్రధానంగా ఉందన్నారు. విద్యారంగ ప్రయోజనాలు, ఉపాధ్యా యులు, ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణకు పిడిఎఫ్ ఎంఎల్‌సిల గెలుపు అవశ్యమన్నారు. అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు మాట్లా డుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక పర్యాయాలు ఎంఎల్‌సి ఎన్నికల్లో విజయం సాధించామన్నారు. దీనికి ప్రజా సంఘాల పోరాటాలు, నాయకత్వాల కృషి ప్రధాన కారణాలుగా ఉన్నాయన్నారు. యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య అధ్యక్షోపన్యాసం చేస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం శాసన మండలిలోనూ, బయటా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు చేసిన అనేక పోరాటాలను గుర్తుచేశారు. ముఖ్యంగా టీచర్ అప్రెంటిస్‌షిప్ రద్దు కోసం లక్ష్మణరావు నిరవధిక దీక్ష చేసి ఫలితం సాధించారన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో పలు ప్రజా సమస్యలను, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను అధికారుల దృష్టికి, మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం సంఘటిత, అసంఘటిత రంగ కార్మికల సమస్యలపై నిత్యం శాసన మండలిలోనూ, బయట ప్రస్తావిస్తూ వారికి మద్దతుగా ఉండే లక్ష్మణరావుకు తాము మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్ కుమార్ మాట్లాడుతూ 2010, 2015లో మెరుగైన పిఆర్‌సి, ఫిట్మెంట్ ఇప్పించడంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి చేసిన కృషిని వివరించారు. ఈసమావేశంలో మధ్యతరగతి ప్రజాసంఘాల కన్వీనర్ విజయ ప్రకాశ్, సిఐటియు నాయకులు సుధాకర్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.సుప్రజ, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కమల, మెడికల్ రిప్స్ నాయకులు యు.వి.కృష్ణయ్య, వి.సాంబిరెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, డివైఎఫ్ఐ నాయకులు ఎ.నాగేశ్వరరావు, యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, జిల్లా నాయకులు ఎం.కృష్ణయ్య, పి.లీల, పి.నాగేశ్వరరావు తదితరులు లక్ష్మణరావుకు మద్దతుగా మాట్లాడారు. ఎల్ఐసి నాయకులు ఇ.వి.తులసీరావు, బిఎస్ఎన్ఎల్ పెన్షనర్ల నాయకులు కె.ఎస్.సి.బోస్, ఎల్ఐసి పెన్షనర్స్ యూనియన్ నాయకులు ఎన్.గోపాల కష్ణ, డివైఎఫ్ఐ నాయకులు ఎన్.నాగేశ్వరరావు, జనవిజ్ఞాన వేదిక నాయకులు శ్రీనివాస్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు డి.హరిప్రసాద్, బి.రెడ్‌స్టార్, షేక్ ప్రైమర్ సాహెబ్, కె.మల్లికార్జునరెడ్డి, పలు ప్రజా సంఘాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఎన్‌టిఆర్ వర్ధంతి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పేదలకు కూడు, గూడు, గుడ్డ కల్పించడమే తన తక్షణ కర్తవ్యమని నినదించిన అన్న నందమూరి తారక రామారావు స్ఫూర్తితో ముందుకు నడుస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి సందర్భంగా మచిలీపట్నం నియోజకవర్గంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, బండి రామకష్ణతో కలిసి ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి , బస్ స్టాండ్ సెంటర్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గత మూడు నెలల్లో చనిపోయిన కార్యకర్తలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిభిరాన్ని ప్రారంభించారు. బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** తెలుగుదేశం పార్టీని స్థాపించి పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిన గొప్ప మహానాయకుడు ఎన్టీరామారావుని తెలుగుదేశం పార్టీ నాయకులు తాతినేని రమేష్ అన్నారు. శనివారం మండలంలోని కపిలేశ్వం ుపురంలో ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలవేసి నాయకులు నివాళులర్పించారు. కొల్లిపర బాబి, తాతినేని ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గుడివాడ ఏలూరు రోడ్డులోని నాగవరప్పాడు వంతెన వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం గుడివాడ పట్టణ పురవీధుల్లో వందలాదిమంది టిడిపి నాయకులు అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఉన్న నందమూరి తారకరామారావు కాంస్య విగ్రహం వద్దకు చేరుకొని విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. తదుపరి ఎన్‌టిర్ ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము రక్తదానం చేసి, అన్నక్యాంటిన్‌లో పేదలకు అన్నదానం, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. జనసేన నాయకుడు బూరగడ్డ శ్రీకాంత్, నాయకులు దింట్యా రాంబాబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** భూమి ఆకాశం ఉన్నంత వరకు ఎన్టీఆర్ కీర్తి చిరస్మరణీయం అని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మెన్ చలసాని ఆంజనేయులు అన్నారు. నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి శనివారం హనుమాన్ జంక్షన్ లోని కాకాని కళ్యాణ మంటపం లో నిర్వహించారు. ఈ సందర్భంగా చలసాని ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హనుమాన్ జంక్షన్ పాలశీతల కేంద్రం మేనేజర్ మాగంటి హరిబాబు, పాల శీతల కేంద్రం సూపర్వైజర్ లు, సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** చల్లపల్లి ఎన్టీఆర్ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ అబ్జర్వర్ కనపర్తి శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకులు మిక్కిలినేని మధు, కనపర్తి శ్రీనివాసరావు, ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు ఘన నివాళులు అర్పించారు. **ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం మండలం కేసరపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు పలగాని బాలకష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గన్నవరం మాజీ శాసన సభ్యులు మూల్పూరి బాలకష్ణ, మాజీ ఎంపీపీ పొట్లూరి బసవరావు, జాస్తి వీరబాబు, బెజవాడ చంద్రశేఖర్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** గుడ్లవల్లేరు, డోకిపర్రులలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కొసరాజు బాపయ్య పయ్య చౌదరి, జంగం మోహన్ రావు, చాపరాల బాలాజీ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** మండలంలోని కుమ్మమూరు గ్రామంలో తెలుగు జిల్లా మాజీ అధ్యక్షుడు రామినేని వెంకట కుటుంబ నరసింహారావు (కుటుంబయ్య) అధ్యక్షతన నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తోట్లవల్లూరు, గరికపర్రు, పెనమకూరు, చాగంటిపాడు గ్రామాలలో మండల టిడిపి అధ్యక్షుడు వీరపనేని శివరామ్ అధ్యక్షతన ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీరంకి వెంకట గురుమూర్తి, నెక్కలపూడి మురళి, చింతపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి గూడూరు :** గూడూరు ప్రధాన సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో డిసి చైర్మన్ పోతన స్వామి పాల్గొన్నారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పళ్ళు పంచిపెట్టారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గోపి నాగబాబు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎన్ ఏ బేగ్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కట్టమనేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మోపిదేవి :** మోపిదేవి మండలం వెంకటాపురంలో మండల తెలుగు యువత కార్యదర్శి నలకుర్తి కష్ణ ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలో ఘనంగా నివాళులర్పించారు. మోపిదేవి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్దన్ రావు, ఎంపీపీ రావి దుర్గ వాణి, మాజీ సి డి సి చైర్మన్ రావి నాగేశ్వరరావు, జడ్పిటిసి మేడబలిమి మల్లికార్జునరావు పాల్గొన్నారు**ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లి మండలం అర్ధమూరులో నిర్వహించిన కార్యక్రమంలో వద్ధులకు పండ్లను పంచిపెట్టారు. పెడన శాసనసభ్యులు శ్రీ కాగిత కష్ణ ప్రసాద్, బంటుమిల్లి మండల అధ్యక్షులు కూనపురెడ్డి వీరబాబు, డి సి చైర్మన్ బొర్రా కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-అవనిగడ్డ :** స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నియోజకవర్గ అబ్జర్వర్ కనపర్తి శ్రీనివాసరావు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, నియోజకవర్గ నాయకులు ఎన్నారై బొబ్బా గోవర్ధన్ పూలదండలు వేసి నివాళులర్పించారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావుచ టిడిపి నాయకులు మండ వబాలవర్తి రావుచ కర్ర సుధాకంచ్ బండే కనకదుర్గచ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే కార్యాలయం వద్ద కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతిలో ఎన్టీఆర్ విగ్రహాని కి పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు పూలదండలు వేసి నివాళులర్పించారు. అలాగే ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయన కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసరావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. విక్కుర్తి రాంబాబు పాల్గొన్నారు.



మోపిదేవి మండలంలో నివాళులర్పిస్తున్న నాయకులు



తోట్లవల్లూరు మండలంలో నివాళులర్పిస్తున్న దృశ్యం



పమిడిముక్కల మండలంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

వైసిపి కార్యకర్త హత్య ?



మృతదేహాన్ని పరిశీలిస్తున్న మొండితోక జగన్‌మోహన్‌రావు

ప్రజాశక్తి - నంది గామ : ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మండలం పల్లగిరి గ్రామానికి చెందిన ఓ వైసిపి కార్యకర్త అనుమానాస్పద స్థితిలో మరణించాడు. తమ కుమారుడిని హత్య చేసినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా, రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు పోలీసులు చెబుతున్నారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... పల్లగిరి గ్రామానికి చెందిన షేక్ నాగుల్ మీరా, ఆయన స్నేహితులు నూరుద్దీన్, నరేష్ కంకర కోసం ట్రాక్టర్‌పై సమీపంలోని దొనబండ క్వారీకి వెళ్లారు. ట్రాక్టర్ పరిటాల సమీపంలో స్పీడ్ బ్రేకర్ ఎక్కి దిగుతుండగా, ట్రాక్టరు పైనుండి నాగుల్ మీరా కిందపడి మరణించాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న స్నేహితులు మీరా మృతదేహాన్ని ట్రాక్టరుపై తీసుకొచ్చి పల్లగిరి-గోళ్లమూడి గ్రామాల మధ్య సుబాబుల్ తోటలో పడేశారు. కుటుంబ సభ్యులు నాగుల్ మీరా కనిపించకపోవడంతో గాలింపు చేపట్టారు. చివరికి సుబాల్ తోటలో శవమై కనిపించాడు. దీంతో తమ కుమారుడిని హత్య చేసి సుబాబుల్ తోటలో పడేశారని మృతుని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మతునికి భార్య ఉంది. నాగుల్ మీరా వైసిపి కార్యకర్త కాగా, ఆయన చిన్నాన్న వైసిపి నాయకునిగా, ఆ పార్టీ కో ఆప్షన్ ఎంపిటిసి సభ్యునిగా ఉన్నారు. మీరా స్నేహితులు నూరుద్దీన్, నరేష్ టిడిపి కార్యకర్తలుగా ఉన్నారు.

మరోవైపు ఈ ఘటనను రోడ్డు ప్రమాదంగా పోలీసులు చెబుతున్నారు. ట్రాక్టర్‌పై నుండి పడి నాగుల్ మీరా చనిపోయాడని, అయితే మద్యం మత్తులో ఉన్న మీరా స్నేహితులు భయపడి మృతదేహాన్ని సుబాబుల్ తోటలో వేశారని అంటున్నారు. అయినా మృతదేహాన్ని సంఘటనా ప్రదేశం నుండి తరలించటాన్ని హత్యా నేరంగానే పరిగణించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు మీరా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా కేసును విచారిస్తామని నందిగామ సిఐ వైవిఎల్ నాయుడు తెలిపారు.

మీరా మృతదేహాన్ని పరిశీలించిన మాజీ ఎంఎల్ఏ మొండితోక

నాగుల్ మీరాను టిడిపి కార్యకర్తలు దారుణంగా హత్య చేసి ఊరు బయట నిర్మానుష ప్రదేశంలో మతదేహాన్ని పడేశారని నందిగామ మాజీ ఎంఎల్ఎ డాక్టర్ మొండితోక జగన్మోహనరావు ఆరోపించారు. సుబాబుల్ తోటలో ఉన్న మీరా మృతదేహాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మొండితోక మాట్లాడుతూ హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పాపారావుకు సత్కారం

ప్రజాశక్తి-కోడూరు : రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నియమితులై మొదటిసారిగా హంసలదీవి పంచాయతీలోని పాలకాయతిప్ప గ్రామానికి వచ్చిన చిలకలపూడి పాపారావును గ్రామానికి చెందిన చెన్ను చిన్న వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అగ్నికుల క్షత్రియుల సమస్యలపై అవగాహన ఉన్న పాపారావుకు రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి ఇవ్వడం అభినందనీయమని వెంకటేశ్వరరావు అన్నారు. సన్మాన గ్రహీత పాపారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి అగ్నికుల క్షత్రియలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దేవనబోయన వెంకటేశ్వరరావు, రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు తిరుపతి శ్రీనివాసరావు, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు మరే గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తారకరామా మందిరం ప్రారంభం

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఉంగుటూరు సెంటర్‌లో గత రెండు సంవత్సరాల క్రితం గన్నవరం మాజీ శాసనసభ్యులు డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, విజయ ఎలక్ట్రికల్ అధినేత దాసరి జైరమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తారక రామా మందిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలవర్ధనరావు మాట్లాడుతూ నటుడుగా ప్రజలను అలరించిన రామారావు దంపతుల విగ్రహాలను ప్రారంభ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి నాదేళ్ళ మురళీకష్ణ ,గొంది సాంబశివరావు, గుత్తా అనీల్ పాల్గొన్నారు.

జూదాల ముందు చట్టం అపహాస్యం

వీక్షణం

సంక్రాంతి నాడు చట్టం అపహాస్యం పాలయింది. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల, నేతల ఒత్తిడికి అధికారులు సైతం మిన్నకుండి పోవాల్సి వచ్చింది. కోడిపందేలు, జూద క్రీడలు యధేచ్ఛగా జరిగాయి. వందల కోట్లు చేతులు మారాయి. కొట్లాటలు జరిగాయి. మద్యం ఏరులై పారింది. అనేక మంది పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారు. కూటమి ప్రభుత్వం ప్రజాప్రతినిధులు, నేతలు నేరుగా రంగ ప్రవేశం చేసి కోడిపందేలు, జూద క్రీడలను ఆడించారనే విమర్శ బహటంగానే వ్యక్తం అయింది. మండల, గ్రామ స్థాయిలో ఏ పార్టీ నేతలకు పట్టు ఉందో...వారి నేతృత్వంలో కోడిపందేలు, జూద క్రీడలు జరిగాయి. రాజకీయ వత్తిడికి అధికారులు సైతం చేసేది లేక ప్రేక్షకపాత్ర పోషించాల్సి వచ్చింది. సంక్రాంతి రెండు, మూడు రోజుల ముందు వరకు కూడా కోడిపందేలు వేయవద్దని హడావుడి చేసి, చివరకు ఏమి చేయలేని నిస్సహాయ స్థితికి నెట్టబడ్డారు. సంక్రాంతి పండగ రోజుల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాలో కోడిపందాలు...జూద క్రీడలు పెద్ద ఎత్తున జరిగాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని దాదాపుగా అన్ని మండలాల్లో కోడిపందేలు జరిగాయి. పలు చోట్ల ఘర్షణలు కూడా చోటు చేసుకున్నాయి. పెద్ద, చిన్న బరులు వందల్లోనే ఏర్పాటయ్యాయి. మూడు రోజుల పాటు బరుల వద్ద మద్యం ఏరులైంది. కోర్టుల ఆదేశాలు, జిల్లా కలెక్టర్ల, జిల్లా పోలీసు అధికారుల హెచ్చరికలను సైతం ఖాతరు చేయకుండా యధేచ్ఛగా భారీ స్థాయిలో కోడిపందాలు, జూద క్రీడలు ఆడారు. కృష్ణాజిల్లా ఘంటసాల మండలం కొడాలి గ్రామ పరిసరాల్లో భోగి రోజు మధ్యాహ్నం 11 గంటల సమయంలో కోడి పందేల బరులను పోలీసులు ధ్వంసం చేయగా, అదే రోజు రాత్రి 12 గంటల సమయంలో ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో పెద్ద ఎత్తున కోడిపందేలు వేశారు. ఇక్కడే ఇండోనేషియా తరహాలో బరుల్లోకి ఒకే సారి 10 పుంజులను దించిన పందెం రాయుళ్ళు, రెండు కోళ్లకు రూ.50 వేలు చొప్పున ప్రైజ్‌మని ఇచ్చిన పరిస్థితి ఉంది. గుడ్లవల్లెరు మండలం వేమవరంలో ఒకే కోడి నాలుగు సార్లు గెలిచినందున విజేతకు బులెట్ బండి బహుమతిగా ఇచ్చారు. ఇదే పరిస్థితి కంకిపాడు, బందర్ డివిజన్లలోని ఆయా పోలీస్టేషన్ల పరిధిలో రాత్రింబవళ్ల కోడిపందేలు జరిగాయి. బరుల వద్ద పీకల్లోతు తాగిన మైకంలో కొట్లాటలు, గొడవలు కూడా ఎక్కువగా జరిగాయి. పెనుగంచిప్రోలు మండలంలోని మామిడి తోటలోని ఏసి ఫంక్షన్ హాలులో రోజుల తరబడి క్యాసినో తరహాలో రాత్రింబవళ్లు జూదం ఆడారు. ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి రూ.25 లక్షలు పోగొట్టుకోవడం జరిగింది. నందిగామ, కంచికచర్లభారీ స్థాయిలో టెంట్లు వేసి కోడిపందేలు వేశారు. తిరువూరు నియోజకవర్గంలోని విసన్నపేటలోని తాతకుంట్లలో ఎమ్మెల్యే సంబరాల్లో పాల్గొని బులెట్ నడిపారు. కంచికచర్ల మండలం గండేపల్లిలో ఎంట్రీఫీజు కింద రూ.పది వేలు వసూలు చేశారు. బాపులపాడు మండలం అంపాపురంలో పెద్ద బరిలో ఒక్కొక్క పందేనికి రూ.ఐదు లక్షలుగా నిర్ణయించి, భారీ మొత్తంలో నగదు చేతులు మారింది. ఇదే అదునుగా కోడిపందేలు, జూద క్రీడల వద్ద భారీ మొత్తంలో డబ్బులు చేతులు మారాయి. ఇదే అదునుగా కొందరు వడ్డీకి డబ్బు తిప్పారు. గంటకు రూ.10 నుంచి రూ.50 వరకు వడ్డీకి తిప్పారు. నగదు లావాదేవీలకు క్యూఆర్ కోడ్ స్కాన్, నగదు లెక్కింపునకు మిషన్లు సైతం వినియోగించారు. బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి నగదు ఇచ్చేందుకు ఫైనాన్స్ ప్రతినిధులను బరుల వద్ద ఏర్పాటు చేయించారంటే కోడిపందేలు, జూద క్రీడలు ఏ స్థాయిలో నడిచాయో చెప్పవచ్చు. గతంలో ఇటువంటి పరిస్తితి ఏనాడు లేదని స్వయంగా అధికారపార్టీ నేతలే వ్యక్తం చేయడం గమనార్హం. కోడిపందేలు, జూదక్రీడలు, మద్యం వీటి వల్ల ఎంతో మంది నష్టాల బారిన పడటంతో పాటు అనేక రూపాల్లో ఇబ్బందులు పాలవ్వగా, పలువురు భారీ మొత్తంలో సొమ్ము చేసుకున్నారు. అయితే ఇదే సమయములో కోడిపందేలు, జూద క్రీడలకు భిన్నంగా, డివైఎఫ్ఐ, సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ లాంటి సంఘాలు సాంప్రదాయ క్రీడలు నిర్వహించి, విజయవాడ నగరంతో పాటు ఉమ్మడి కృష్ణాజిల్లాలో పెద్ద ఎత్తున యువతీ యువకులు, చిన్నారులు, మహిళలను పెద్ద ఎత్తున సమీకరించి, క్రీడా స్ఫూర్తిని నింపడంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి వందల సంఖ్యలో బహుమతులు అందజేసి, వారిని ప్రోత్సహించడం గమనార్హం. ప్రభుత్వంలోని పెద్దల అండతో కోడిపందేలు, జూద క్రీడలవైపు ప్రజలను తీసుకెళ్లే క్రమంలో సంక్రాంతి అంటే అవి కాదు...వాటిని భిన్నమైన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రజలకు మంచి చేసే విధంగా యువజన సంఘాలు ఎంతో స్ఫూర్తిగా నిలిచాయని చప్పక తప్పదు.

విహెచ్ఆర్



బహుమతుల ప్రదానంలో మాట్లాడుతున్న రమాదేవి

బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కుండనాల భాస్కర్ 20వ వర్ధంతి, కుండనాల అనిల్ వంశీ జ్ఞాపకార్థంగా చెరువు సెంటర్ మర్రిచెట్టు సెంటర్లో ఈనెల 14న సంక్రాంతి ఆటలు పోటీలు నిర్వహించారు. విజేతలకు 17న బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భవానీపురం సిఐ సి.ఉమామహేశ్వరరావు, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పి.అప్పన్న, ఐద్వా నగర అధ్యక్షురాలు కె.శేషు మణి, జి.ఆదిలక్ష్మి, డివైఎఫ్ఐ నాయకులు జి.అంజిబాబు, సిపిఎం 44వ డివిజన్ కార్యదర్శి ఆర్.మోహన్ సీనియర్ నాయకులు పుల్లారావు వికరం లక్ష్మి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు విద్యార్థులు, ఆర్డిఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జెవివి డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరువూరు : జనవిజ్ఞానవేదిక రూపొందించిన డైరీని తిరువూరు ఆర్‌డిఒ కె.మాధురి శనివారం స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రజలను మూఢ నమ్మకాల బారినపడకుండా జెవివి చేస్తున్న కృషి మరువలేనిదని ఆర్‌డిఒ అన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.హరికృష్ణ, జిల్లా కార్యదర్శి ఎం.రాం ప్రదీప్, తిరువూరు మండల ప్రధాన కార్యదర్శి డి.సుదర్శన్, మండల అధ్యక్షుడు ఎం. సుధాకర్, మండల కోశాధికారి ఎస్‌డి. సుభానీ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మడి సిల్వర్ జ్యుయలరీ షోరూమ్‌కు మీనాక్షి ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :

ఎమ్మడి సిల్వర్ జ్యువెలరీ, విజయవాడలో తమ ప్రత్యేక షోరూమ్‌ను శనివారం ప్రారంభించినట్లు సంతోషంగా వెల్లడించింది. వైభవోపేతమైన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నటి మీనాక్షి చౌదరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంస్థ సిఇఒ ఎమ్మడి సునీత ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విజయవాడలోని ఈ ప్రతిష్టాత్మక షోరూమ్ దేశంలోనే అత్యుత్తమ వెండి ఆభరణాలకు ప్రధాన గమ్యస్థానంగా ఎమ్మడి స్థానాన్ని పునరుద్ఘాటిస్తుందన్నారు. అత్యుత్తమ పనితనం, సృజనాత్మకతకు ప్రసిద్ధి చెందిన ఈ బ్రాండ్, సంప్రదాయం ఆధునికతను మిళితం చేసే డిజైన్లతో బ్రైడల్ సిల్వర్ జ్యువెలరీలో ప్రత్యేకత కలిగి ఉందన్నారు. ఈ సందర్భంగా తన కుటుంబ సభ్యులతో కలిసి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ ఎమ్మడి మాట్లాడుతూ "ఎమ్మడి సిల్వర్ జ్యువెలరీ ద్వారా తాము భారతదేశంలో అతిపెద్ద బ్రైడల్ సిల్వర్ జ్యువెలరీ బ్రాండ్‌ను ప్రదర్శించడం పట్ల సంతోషంగా ఉన్నామన్నారు. నేటి మార్కెట్లో అత్యధిక డిమాండ్ ఉన్న విభాగాల్లో ఒకటైన బ్రైడల్ సిల్వర్ జ్యువెలరీకి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఈ అసాధారణ షోరూమ్ ప్రత్యేకంగా తీర్చిదిద్దబడిందన్నారు. ఈ శాఖతో, సాటిలేని చక్కదనంకళాత్మకతను అందించే మా వారసత్వాన్ని మరింతగా ప్రదర్శించటమే తమ లక్ష్యం అన్నారు.

పుస్తకాలు బహూకరణ

విజయవాడ : తెలుగు భాష, గ్రంథాలయాలపై ప్రత్యేకమైన శ్రద్ధ కలిగిన గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య వారసుడు సరస్వతి సామ్రాజ్య ట్రస్ట్ అధ్యక్షులు అయ్యంకి మురళీకృష్ణ, ఠాగూర్ స్మారక గ్రంథాలయానికి నవలలను సుమారు 8 వేల రూపాయల విలువ కలిగిన పుస్తకాలను బహూకరించారు. విద్యార్థులు, పాటకుల కోరిక మేరకు విజయవాడ బుక్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులకు నీతి కథలకు సంబంధించిన పుస్తకాలను, పాఠకులకు కొమ్మూరు చంద్రశేఖర్, యండమూరి వీరేంద్రనాథ్ రచించిన పుస్తకాలు అందజేశారు. ఈ పుస్తకాలను బహూకరించినందుకు గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది శ్రీ అయ్యంక్ మురళీకృష్ణను అభినందించారు.



పుస్తకాలు చూస్తున్న దృశ్యం

నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్

విజయవాడ : ఏ కోర్సు తీసుకుంటే భవిష్యత్తు ఎలా ఉంటుందనే విషయంపై అవగాహన కల్పిస్తూ కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నవజీవన్ బాల భవన్ వారు శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి పెజ్జోనిపేట పారిస్ ఫెస్ట్ ఫాదర్ పాలెం జీవన్ మాట్లాడుతూ కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం ప్రాముఖ్యత గురించి చెప్పారు. భవిష్యత్తులో పిల్లలు ఎలా ఎదగాలి, ఎటు వైపు సాగితే మన జీవితం ఎలా ఉంటుందో వివరించారు. 10వ తరగతి తర్వాత ఎలా చదివితే బాగుంటుంది, ఏ కోర్సులో చేరితే జీవితం ఎలా ఉంటుంది ముందు భవిష్యత్తు ఎలా సాగుతుందనేది విశ్లేషించారు. అనంతరం ప్రోగ్రాం మేనేజర్ ఎమ్‌డి వసంత కుమారి మాట్లాడుతూ పిల్లలకు భవిష్యత్తు పట్ల సరైన అవగాహన కల్పించామన్నారు. పిల్లలకు జీవితంలో ఎదుగుదల గురించి ప్రసన్న, అలఫోన్స్, సునీత చెప్పారు. ఈ ప్రోగ్రాంలో డిబి లెర్నింగ్ సెంటర్ టీచర్స్ శ్రవణ్, శ్రావణి, ఆశ, సౌజన్య, పావని, రమ్య, తిరుపతమ్మ, అనిష్మ, రేవతి, రాజ్యలక్ష్మి, ఆషాజ్యోతి, లలిత, హామిక, మేరీ, సుజాత, సుభాషిణి, రెబక పాల్గొన్నారు.



తెలుగువారు సంఘటితం కావాలి: పవన్‌కళ్యాణ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తెలుగువారు ఎక్కడున్నా సంఘటితమవ్వాలని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ (ఏఏఏ) వ్యవస్థాపకుడు హరి మోటుపల్లి, జాతీయ అధ్యక్షుడు బాలాజీ వీర్నాలతో కలిసి, ఆ సంస్థ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రిని శనివారం ఆయన కార్యాలయంలో కలిశారు. అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమాలు, సంస్థ లక్ష్యాల గురించి తెలుసుకున్న పవన్ కళ్యాణ్.. తెలుగు జాతి అభ్యున్నతికి ఏఏఏ అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. తెలుగు వారి ఐక్యత, తెలుగు జాతి సంస్కతి, సంప్రదాయాల పరిరక్షణకు విస్తతంగా కషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రవాసాంధ్రులను కార్యోన్ముఖులను చేయాలని కోరారు. సొంత ఊళ్లలో మౌలిక వసతుల కల్పనకు సహకారం అందించేలా ప్రవాసాంధ్రులను ఉత్తేజితులను చేయాలని పవన్ కళ్యాణ్ అన్నారు. మార్చి 28, 29 తేదీల్లో నిర్వహించనున్న తమ సంస్థ నేషనల్ కన్వెన్షన్ కు హాజరు కావాల్సిందిగా డిప్యూటీ సీఎంను ఏఏఏ నేతలు ఆహ్వానించారు. వారి ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన పవన్ కళ్యాణ్.. ఏఏఏ నిర్వహించే కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని పేర్కొన్నారు.



ఎన్నికల సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి- నందిగామ :

2024 సాధారణ ఎన్నికలలో ట్రైనింగ్‌లో పాల్గొన్న ఉద్యోగులకు డ్యూటీ సర్టిఫికేట్లు ఇవ్వాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. 2024 సాధారణ ఎన్నికల్లో పాల్గొన్న సిబ్బందికి(మే 12,13) పిఒ ,ఎపిఒ,ఒపిఒ , రిజర్వ్ సిబ్బందికి, ఏప్రిల్ లో ట్రైనింగ్ 13,14 తేదీలకు , మే 4,6 తేదీలలో ట్రైనింగ్ లో పాల్గొన్న వారందరికీ డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పించాలని నందిగామ ఆర్డీవో బాలకష్ణ కు యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బి రమణయ్య, జిల్లా ఆడిట్ కన్వీనర్ మహేశ్వర వెంకటేశ్వర, రాష్ట్ర కౌన్సిలర్ గంగరాజు, చందర్లపాడు కోశాధికారి వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ప్రతిభా పురస్కారానికి రఘునందన్ ఎంపిక

ప్రజాశక్తి - తిరువూరు :

తెలుగు భాష, సంస్కృతి, కళల పరిరక్షణకు కృషి చేస్తున్న తిరువూరుకు చెందిన రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి, అరసం జిల్లా కార్యదర్శి రేపాక రఘునందన్‌ను తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయిట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న విజయవాడలోని కౌతా పూర్ణానంద్ విలాస్ కళావేదికలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని రఘునందన్‌కు అందజేయనున్నట్లు తెలిపారు.